# శ్రీ పయ్యావుల కేశవ్

## గౌరవనీయ ఆర్థిక శాఖామాత్యుల వారి ప్రసంగం

## ఫిబ్రవరి 14, 2026

గౌరవనీయులైన అధ్యక్షా!, గౌరవ ముఖ్యమంత్రివర్యా! గౌరవ ఉప ముఖ్య మంత్రివర్యా! మరియు గౌరవ సభ్యులారా!

1. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలను ఈ గౌరవసభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నాను. ఈ బడ్జెట్ ఒట్టి జమాఖర్చుల లెక్క మాత్రమే కాదు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు ఉద్దేశించిన రోడ్డు మ్యాప్ ఇది.

2. వరుసగా మూడోసారి బడ్జెట్ సమర్పించడం నాకు దక్కిన అపూర్వమైన గౌరవం. ఈ అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిగారికి సర్వదా కృతజ్ఞుడిని మా దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదు. ఇది అంకెలకు అతీతం. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమాల్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలన్న మా దృఢ సంకల్పాన్ని బలంగా చాటిచెప్పే ఒక ప్రకటన. ఈ బడ్జెట్ సాగునీటి కోసం ఎదురుచూసే రాయలసీమ రైతుల కలల్ని సాకారం చేసేదీ, అవకాశాల కోసం ఎదురు చూస్తున్న శ్రీకాకుళం జిల్లాలోని యువ పట్టభద్రులకు గుండె నిబ్బరాన్నిచ్చేదీ, భవిష్యత్తుపై కొండంత ఆశతో కుటుంబాన్ని నడిపిస్తున్న నెల్లూరు జిల్లాలోని గృహిణికి భరోసానిచ్చేదీ, కోస్తాంధ్రలోని మహిళా పారిశ్రామికవేత్తలో స్ఫూర్తిని నింపేదీ. దీనిలో ప్రతిపాదించే ప్రతి రూపాయీ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షల్ని సాకారం చేసేందుకు ఉద్దేశించిందే.

3. గత ప్రభుత్వ విధ్వంసకర పాలన చేసిన లోతైన గాయాలు, మిగిల్చిన చేదు అనుభవాలు మనం ఏం చేయకూడదో నిరంతరం గుర్తు చేస్తున్నాయి. గత ప్రభుత్వ దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి జరిగిన భారీ నష్టాన్ని, ఆర్థిక విధ్వంసాన్ని గమనంలో ఉంచుకుని 2024 సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టాను. గత ప్రభుత్వం మిగిల్చిన గాయాలను మాన్పి, ఐదేళ్ల విషాదాన్ని దాటుకుని రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించేందుకు 2024 బడ్జెట్ బలమైన పునాది వేసింది. 2025 బడ్జెట్ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపింది.

4. అంత భారీ విధ్వంసానికిగురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రెండేళ్లు చాలా తక్కువ సమయం. 2014లో జరిగిన అహేతుక విభజన రాష్ట్రానికి తగిలిన మొదటి దెబ్బయితే... 2019-24 మధ్య అప్పటి ప్రభుత్వం చేసిన దుష్పరిపాలన, రాష్ట్రానికి తగిలిన మరో పెద్ద షాక్. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, అపసవ్య విధానాలు, పాలకుల అసమర్థత రాష్ట్రాన్ని మరింత ఇబ్బందుల్లో కూరుకుపోయేలా చేశాయి. ఇన్ని సవాళ్లను ఎదుర్కొంటూ కూడా కూటమి ప్రభుత్వం అనుసరించిన నిర్మాణాత్మక విధానాల వల్ల 2024 జూన్ నుంచి... ఈ 20 నెలల్లో రాష్ట్రం అద్భుతమైన అభివృద్ధి పథంలో సాగిందని చెప్పడానికి గర్వపడుతున్నాను.

5. ఇప్పటి వరకు మనం ఏం సాధించాం? ఇప్పుడు ఎక్కడున్నాం? ఇంకా చేయాల్సిందేంటి? అన్న అంశాల్ని కూలంకషంగా మదింపు చేసుకుని ఈ బడ్జెట్ రూపొందించాం. అటు ఉత్తరాంధ్ర నుంచి ఇటు రాయలసీమ వరకు ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు తేవడం ఈ బడ్జెట్ ఉద్దేశం. మా లక్ష్యం...

కేవలం కాగితాలపై కనిపించే వృద్ధి లెక్కలు కానే కాదు. అభివృద్ధి, సంక్షేమ ఫలాల్ని క్షేత్రస్థాయిలోని ప్రజలకు అందేలా చేసి, వారి జీవితాల్లో వెలుగులు చూడాలన్నదే మా తపన.

6. విధ్వంసం నుంచి వికాసం దిశగా... 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు సాగిన అభివృద్ధి ప్రయాణం నిజంగా అద్భుతం. 2024-25లో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టాం. 2019-24 మధ్య 10.3 శాతానికి పడిపోయిన ఆర్థిక వృద్ధి రేటుని 2024-25లో 11.75 శాతానికి పెంచాం. 2025-26లో ఎదురైన అనేక భౌగోళిక ఆర్థిక అనిశ్చితులు సృష్టించిన ప్రతికూల ప్రభావాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లు ఎదుర్కొంది. కానీ భారత్ మాత్రం స్థిరంగా నిలబడింది. జమ్మూకశ్మీర్లో అమాయకులైన పర్యాటకుల్ని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాద మూకలకు ఆపరేషన్ సింధూర్ తో భారత ప్రభుత్వం గట్టి జవాబిచ్చింది. ఉగ్రవాదం, భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, సుంకాల యుద్ధంతో తలెత్తిన ఉద్రిక్తతలకు భారత్ చలించదని... ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం ప్రపంచానికి బలమైన సందేశం ఇచ్చింది. భారతదేశానికి లభించిన గొప్పవరం మోదీ నాయకత్వం. ఆయన నాయకత్వం భారత్‌ను శక్తివంతంగా తీర్చిదిద్దింది. ఆత్మవిశ్వాసంతో తలెత్తుకు నిలిచేలా చేసింది. ఆయన ఈ రోజు భారత్‌ను ప్రపంచ వేదికపై సగర్వంగా తలెత్తుకునేలా చేశారు కాబట్టే... యావత్ జాతీ మోదీ నాయకత్వానికి అండగా నిలబడింది. **"Buland Bharat ki Buland Pehchan Hai Modi"**. భారత్ ఎట్టి పరిస్థితుల్లో తన ప్రయోజనాల విషయంలో రాజీ పడబోదని ప్రపంచానికి అర్థమైంది. ప్రపంచంలో అనేక

ఆస్థిర పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ 8 శాతం వృద్ధిరేటు సాధించి సత్తా చాటింది.

7. భారతదేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా ప్రపంచ వేదికపై వెలుగులీనుతోంది. విశాఖపట్నంలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలన్న గ్లోబల్ ఐటీ దిగ్గజం గూగుల్ నిర్ణయం ఒక్కసారిగా ప్రపంచదేశాలన్నీ ఆంధ్రప్రదేశ్ వైపు తలెత్తి చూసేలా చేశాయి. దాన్ని 'బాహుబలి ఒప్పందం'గా పేర్కొనవచ్చు. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం ఆంధ్రప్రదేశ్ అని ఆ ఒప్పందం రుజువు చేసింది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిగారి సమర్ధ నాయకత్వం మరియు యువనాయకుడు గౌరవ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్‌గారి విశేషకృషి వలన సాధ్యమైంది. ఇదేకాదు రాష్ట్రంలో పెట్టుబడులు వస్తున్నాయి, ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది అంటే అది గౌరవ ముఖ్యమంత్రిగారి దార్శనిక పాలన మరియు గౌరవ ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్‌గారి విశ్వసనీయ భాగస్వామ్యం వల్లనే సాధ్యమైంది.

8. ఈ మార్పుకి సారథులు మన రాష్ట్ర ప్రజలేనని మేం బలంగా నమ్ముతున్నాం. 2024 జూన్‌లో రాష్ట్ర ప్రజలు ఎన్డీఏకి కనీవినీ ఎరుగని రీతిలో ఘన విజయం కట్టబెట్టినప్పుడే ఈ మార్పు మొదలైంది. ప్రజలు మాకు వేసిన ప్రతి ఓటు వెనుకా వారి ఉద్దేశం బలంగా ప్రస్ఫుటమైంది. ప్రజలు వారితో పాటు, వారి పిల్లలకు సురక్షితమైన బంగారు భవిష్యత్తు కోసం ఎన్డీఏని అధికారంలోకి తెచ్చారు.

9. గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తల్ని, పెట్టుబడిదారుల్ని రాష్టం నుంచి తరిమేసింది. 2019-24 మధ్య అప్పటి పాలకుల నుంచి ఎదురైన చేదు

అనుభవాలతో పెట్టుబడిదారులు రాష్ట్రానికి రావాలంటేనే భయపడిపోయారు. పెట్టుబడులు రాకపోవడం, ఉన్న పరిశ్రమలనే మూసివేయడంతో నిరుద్యోగం తాండవించింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ 20 నెలల్లో పరిస్థితులు పూర్తిగా మారాయి. పెట్టుబడిదారులకు దేశంలోనే అత్యంత అనుకూలమైన పరిస్థితులు ఇప్పుడు మన రాష్ట్రంలో ఉన్నాయి. దేశ జనాభాలో కేవలం 4.2 శాతం వాటా మాత్రమే ఉన్నప్పటికీ... ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పెట్టుబడుల్ని ఆకర్షించడంలో మిగతా రాష్ట్రాల్ని వెనక్కునెట్టింది. పెట్టుబడిదారులకు అత్యంత స్నేహపాత్రమైన రాష్ట్రంగా నిలిచింది. బ్యాంక్ అఫ్ బరోడా నివేదిక ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రావడమే దీనికి నిదర్శనం. బ్రాండ్ చంద్రబాబు వల్లే ఇది సాధ్యమైంది. ఇప్పటి వరకు మనం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడేవాళ్లం. ఇప్పుడు గేరు మార్చాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇప్పుడు మన నినాదం. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిగారి సమర్థ నాయకత్వం, దార్శనికత, ప్రభుత్వ సుస్థిర విధానాలు రాష్ట్రాన్ని విజన్-స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం దిశగా వేగంగా నడిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని స్వర్ణమయం చేసే మహా క్రతువులో గౌరవ ముఖ్యమంత్రి చారిత్రాత్మక పాత్ర పోషిస్తున్నారు.

10. “తాను నాటిన చెట్ల నీడలో తానెప్పటికీ కూర్చోలేనని తెలిసినా.. భావి తరాల కోసం చెట్లు నాటే వ్యక్తే... జీవితంయొక్క నిజమైన విలువను అర్థం చేసుకున్నవాడు” అన్న విశ్వకవి, గురుదేవులు శ్రీ రవీంద్రనాథ్ టాగూర్ మాటల్ని నేను ఇక్కడ ఉటంకిస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి ఈ భావనకు అసలైన

ప్రతిరూపం. ఆయన కేవలం దూరదృష్టిగల నాయకుడు మాత్రమే కాదు. దాన్ని సాకారం చేయగల దక్షతగల నాయకుడు. తన దార్శనికతతో అమలు చేస్తున్న విధానాలు భావి తరాలకు మేలు చేస్తాయన్న దృఢ విశ్వాసంతో, వాటి సాధనకు అహర్నిశలు, నిస్వార్థంగా కృషి చేస్తున్న గొప్ప నాయకుడు ఆయన. సమాజ క్షేమం కోసం 365 రోజులూ అవిశ్రాంతంగా, ఒక తపస్సులా ఆయన పనిచేస్తున్నారు. 1990వ దశకంలో ఆయన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి మాట్లాడినప్పుడు, దార్శనికతను అమల్లో పెట్టినప్పుడు... దాని ఫలితం ఎలా ఉంటుందో చాలా మందికి అర్థం కాలేదు. కానీ అప్పటి యువత దాంతో ప్రయోజనం పొంది, జీవితంలో పురోగమించడమే కాకుండా... ప్రపంచ వ్యాప్తంగా అవకాశాల్ని అందిపుచ్చుకుని సత్తా చాటారు. అప్పుడు ఆయన అమలుచేసిన సంస్కరణలు, తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో వెలిగించిన దీపం.. లక్షలాది మంది జీవితాల్లో వెలుగు నింపింది. నేడు ఆయన విజయ గాధను ఆయనే పునరావృతం చేస్తున్నారు. కానీ ఇప్పుడు మరింత గొప్ప దూరదృష్టితో... మరింత సమున్నత లక్ష్యంతో కొత్త చరిత్రను లిఖించబోతున్నారు.

11. *"భవిష్యత్తును అంచనా వేసేందుకు ఉత్తమ మార్గం దాన్ని సృష్టించడమే"* అన్న సూక్తిని బలంగా నమ్మే వ్యక్తి గౌరవ ముఖ్యమంత్రి డీప్ టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు, ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంటర్ప్రెన్యూర్ వంటి విధానాలు కేంద్రంగా ఆయన ఇప్పుడు రాష్ట్రాన్ని సరికొత్త శకంలోకి నడిపిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో **'ఏపీ వెల్త్ ఫండ్'** ప్రారంభించబోతున్నాం. రాబోయే రోజుల్లో అది నార్వే, అబుదాబి **'సావరిన్ వెల్త్ ఫండ్స్'**లా విస్తృతమై... మొత్తం రాష్ట్రాన్నే నడిపించడానికి సరిపోవచ్చు. నాతో

సహా ఈనాటి సమాజానికి పైన తెలిపిన డీప్ టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీల ప్రాముఖ్యత ఈ రోజు అర్థం కాకపోవచ్చు. కానీ ఐటీ రంగంలో ఆయన చూపిన చొరవ వల్ల 1990ల నాటి యువతరం లబ్దిపొందినట్టే... ఈనాటి యువత కూడా ఈ అధునాతన టెక్నాలజీలను అందిపుచ్చుకోవడం ద్వారా భవిష్యత్తులో కచ్చితంగా లబ్ధి పొందుతుంది.

12. ఆర్థిక వనరుల పరంగా మనం ఇప్పటికీ సంక్షోభం నుంచి పూర్తిగా బయటపడలేదు. పరిస్థితులు అంత సానుకూలంగా లేవు. గత ప్రభుత్వం మిగిల్చిన ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితుల్ని అధిగమించే క్రమంలో ఇప్పటికీ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. కానీ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి మా లక్ష్యాల్లో మార్పు లేదు. మా సంకల్పం చెక్కు చెదరలేదు. మా ప్రయాణాన్ని స్థిరంగా కొనసాగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అమూల్యమైన మద్దతు, సహకారం లభిస్తున్నాయి. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న గొప్ప సహకారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. కష్టకాలంలో ఆమె రాష్ట్రానికి వెన్నుదన్నుగా నిలబడ్డారు. పోలవరం ప్రాజెక్టుని మళ్లీ గాడిలో పెట్టడం, రాజధాని అమరావతి నిర్మాణాన్ని పునఃప్రారంభించడంలో పూర్తి సహకారం అందించారు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ ప్రాజెక్టుని ముందుకి తీసుకెళ్లేందుకు అవసరమైన తోడ్పాటు అందించారు. గత ప్రభుత్వం ఎడాపెడా చేసిన అప్పుల భారాన్ని తగ్గించుకునేందుకు రుణాల పునర్వ్యవస్థీకరణకు అమూల్యమైన సహకారం అందజేశారు. ఆమెకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను.

13. 2026-27 సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి ఆశాకిరణంలా కనిపిస్తోంది. దానిలో రాష్ట్ర అభివృద్ధికి అనేక అవకాశాలు కనిపిస్తున్నాయి. తూర్పుకోస్తా పారిశ్రామిక కారిడార్, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకి పూర్వోదయ పథకం ఉపయోగపడుతుంది. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కూడా వేగంగా రూపుదిద్దుకుంటోంది. కేంద్ర బడ్జెట్లో కొత్తగా ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్లు, డేటా సెంటర్లు, ప్రాంతీయ మెడికల్ హబ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, సీప్లేన్ మాన్యుఫ్యాక్చరింగ్, కంటెయినర్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రతి జిల్లాలో బాలికల హాస్టళ్లు వంటి అంశాల నుంచి రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనాలు పొందేందుకు అవకాశముంది.

14. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ప్రభుత్వరంగ ప్రాజెక్టుల్ని పీపీపీ, ఛాలెంజ్ విధానాల్లో చేపట్టే ట్రెండ్ నడుస్తోంది. అది ప్రభుత్వరంగ సంస్థల నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంచేందుకూ దోహదం చేస్తోంది.

పి.పి.పి. విధానంలో ప్రైవేటురంగానికి ఉన్న అనుభవంతో ప్రభుత్వ ప్రాజెక్టుల్ని మరింత మెరుగ్గా అమలు చేయగలం. ప్రాజెక్టు వ్యయాల్ని నిర్ణయించడంలో పారదర్శకతకు, పోటీతత్వాన్ని పెంచేందుకు చాలెంజ్ విధానం దోహదం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో చాలా ప్రాజెక్టుల్ని చాలెంజ్ విధానంలో ప్రకటించడంతో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలకు ద్వారాలు తెరిచినట్టయింది. 'ఛాలెంజ్ మోడ్'లో ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్రం పూర్తి సంసిద్ధంగా ఉంది. ఇతర రాష్ట్రాలతో పోటీపడి కెమికల్ పార్క్, మెగా టెక్స్టైల్ పార్క్, సిటీ ఎకనమిక్ రీజియన్స్, యూనివర్సిటీ టౌన్షిప్ వంటి ప్రాజెక్టుల్ని

సాధించుకోగలమన్న విశ్వాసం మాకుంది. సిటీ ఎకనమిక్ రీజియన్స్ ప్రాజెక్టులో పోటీ పడేందుకు విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ప్లాన్ ను ఇప్పటికే సిద్ధం చేశాం

15. విజన్ స్వర్ణాంధ్ర@2047 అమలుకి, ప్రాంతీయ ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు మా ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోంది. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించింది. నీతి అయోగ్ తో కలసి... విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కి ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేశాం. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. దీనిలో మొత్తం ఏడు గ్రోత్ డ్రైవర్లు ఉన్నాయి. మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీసెస్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయ రంగాల్లో 41 హై ఇంపాక్ట్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయి. వాటికి అవసరమైన నిధుల్ని కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు రంగాల నుంచి సమకూర్చుకుంటాం. మెట్రో రైల్ ప్రాజెక్టులు సహా వీ.ఈ.ఆర్.కి సంబంధించి సుమారు 28 వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పిస్తున్నాం.

16. వీ.ఈ.ఆర్. తరహాలోనే ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో అమరావతి ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేస్తాం. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదం చేసే వనరులు, గ్రోత్ ఇంజిన్లు, బలాల్ని గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తాం.

17. సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను గుర్తించి, 1990ల్లోనే ఆ కాన్సెప్ట్‌ని దేశానికి తీసుకొచ్చిన మొదటి ముఖ్యమంత్రి గౌరవ చంద్రబాబునాయుడుగారు. ఇప్పుడు ఆయన రాయలసీమ రీజియన్‌ను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చి అక్కడి రైతుల జీవితాల్లో సమూల మార్పులు తెచ్చేందుకు కంకణం కట్టుకున్నారు. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ప్లాన్‌ని సిద్ధం చేయించారు. దానిలో భాగంగా 2030 నాటికి ఉద్యానపంటల విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచబోతున్నాం. సాగునీరు, సూక్ష్మ సేద్యం ప్రాజెక్టుల ద్వారా నీటి ఎద్దడి అన్నదే లేకుండా చేస్తాం. ప్రపంచ మార్కెట్లతో అనుసంధానానికి రోడ్డు కనెక్టివిటీ పెంచుతాం. అనంతపురము, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల్లోని 303 మండలాల పరిధిలో 200కి పైగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం.

18. ప్రొడక్ట్ పర్ఫెక్షన్, ఫార్వార్డ్, అండ్ బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్, మొత్తం వాల్యూచైన్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విధానల్ని అమలు చేయడం వంటివి ప్రణాళికలో భాగం. ఈ ప్రాజెక్టు వల్ల ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుంది. ఉద్యాన ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ప్రత్యక్షంగా 9 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. రాయలసీమపై వెనుకబడిన ప్రాంతమన్న ముద్ర తొలగిపోతుంది. ఇకపై రాయలసీమ పేరు చెబితే 'మిగులు' అన్న మాట తప్ప, కొరత అన్న మాట వినబడదు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి 30 వేల కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సమర్పిస్తున్నాం.

19. అప్పుల గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష మిత్రులకు ఒక విషయం గుర్తు చేయదలుచుకున్నాను. మాకు 9.74 లక్షల కోట్ల రూపాయల అప్పులు మిగిల్చి వెళ్లింది మీ ప్రభుత్వమే. మీరు చేసిన అప్పులు తీర్చడానికి మేం మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ రోజు మేం అప్పుగా తెస్తున్న ప్రతి రూపాయి ఉత్పాదక వ్యయంలోకే వెళుతోంది. అది రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధుల చేతుల్లోకి వెళుతోంది. గత ప్రభుత్వ నిర్వాకాల వల్ల సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి... ఇప్పుడు మా ప్రభుత్వం సమర్థ పాలనా విధానాలతో ఆర్థిక సుస్థిరత దిశగా అడుగులు వేస్తోంది. ఖర్చులు తగ్గించుకుని, వనరులు పెంచుకుని ఆర్థిక స్థిరత్వం దిశగా ప్రయాణిస్తోంది.. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని... ఆకాంక్షల సాకారం దిశగా నడిపిస్తున్నాం.

ఇప్పుడు శాఖల వారీగా కేటాయింపులను సభ ముందుంచుతున్న ఈ సందర్భంలో, ఒక విషయాన్ని ప్రత్యేకంగా ఉద్ఘాటించాలనుకుంటున్నాను. ఈరోజు కేటాయిస్తున్న ప్రతి రూపాయి ప్రజల కష్టార్జిత ధనం. ఆ ప్రతి రూపాయిని ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో, సమర్థవంతంగా మరియు బాధ్యతాయుతంగా వినియోగిస్తామని ఈ సభకు హామీ ఇస్తున్నాను.

**జల వనరులు-కరువు రహిత రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్**

20. మా అభివృద్ధి వ్యూహంలో అత్యంత కీలకమైన సాగునీటి రంగానికి బడ్జెట్ అధిక ప్రాధాన్యమిస్తోంది. మనం నిల్వచేసే ప్రతి నీటిబొట్టు, పునరుద్ధరించే ప్రతి కాలవ, సాగునీరందించే ప్రతి ఎకరం... ప్రజల జీవితాల్ని

మారుస్తాయని బలంగా విశ్వసించే ప్రభుత్వం మాది. వాతావరణ మార్పులు, వర్షపాతంలో అనూహ్యమైన హెచ్చుతగ్గులు వంటివి రుతుపవనాలపై పూర్తిగా భరోసాగా ఉండలేని పరిస్థితులు కల్పిస్తున్నాయి. అందుకే నీటి నిల్వ, సమర్థ పంపిణీపై ఎక్కువ దృష్టి పెట్టాం. కేవలం ప్రాజెక్టులు కడితే సరిపోదు. భవిష్యత్ తరాలకు దీర్ఘకాలిక నీటి భద్రతను కల్పించేలా మన విధానాలుండాలన్నది మా లక్ష్యం. గత ప్రభుత్వం ప్రజల నిజమైన అవసరాల్ని అర్థం చేసుకోలేదు. బిల్లులు చెల్లించకపోవడం, అధ్వాన్న నిర్వహణ వల్ల సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రాజెక్టుల రొటీన్ నిర్వహణ, డ్యామ్‌ల భద్రతను కూడా గాలికొదిలేసింది. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడం వల్ల జరిగిన విధ్వంసాన్ని, ప్రాణనష్టాన్ని ఎలా మర్చిపోగలం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పోలవరం డ్యామ్ డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది.

21. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గం ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల సాగునీటి వ్యవస్థలపై సమగ్ర అవగాహన కలిగిన గౌరవ ముఖ్యమంత్రి గారు మన రాష్ట్రానికి లభించడం మన అదృష్టం. పట్టిసీమ వంటి పథకాలను ఆయన సక్రమంగా ప్రణాళిక చేసి అమలు చేయడం ద్వారా, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు జల భద్రతను కల్పించారు.

అదేవిధంగా, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టును కేవలం 100 రోజుల్లో ప్రారంభించి, వేగంగా పూర్తి చేసి, రైతులకు నీరు అందించేలా చేయడంలో ఆయన సంకల్పబలం కీలక పాత్ర పోషించింది. ఏవీఆర్ హంద్రి-నీవా ద్వారా

తొలిసారిగా సుమారు 45 టీఎంసీల కృష్ణా జలాలను విజయవంతంగా ఎత్తిపోతల చేసి, రాయలసీమలో నీటి లభ్యతను గణనీయంగా మెరుగుపరిచాము.

పోలవరం ప్రాజెక్టు విషయంలో, పెండింగ్‌లో ఉన్న రూ.5,000 కోట్ల బిల్లులను చెల్లించి పనులను వేగవంతం చేశాము. డయాఫ్రాగం గోడ నిర్మాణం ఇప్పటికే 91 శాతం పూర్తయింది. మొత్తం ప్రాజెక్టు పురోగతి 60 శాతాన్ని దాటింది.

22. వెలిగొండ ప్రాజెక్టు, బి.ఆర్.ఆర్. వంశధారా దశ-II, అలాగే వంశధార--నాగావళి మరియు నాగావళి-చంపావతి నదుల అనుసంధాన పనుల్లో సమాంతరంగా గణనీయమైన పురోగతి సాధించబడింది. అదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో చేపట్టిన ఆపరేషన్ & మెయింటెనెన్స్, ఎస్‌డీఎంఎఫ్ మరియు ఎఫ్‌డీఆర్ పనులు సాగునీటి వ్యవస్థలను స్థిరీకరిస్తున్నాయి.

ఐదేళ్ల విరామం అనంతరం, మొత్తం 6,047 నీటి వినియోగదారుల సంఘాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పునరుద్ధరించడం ద్వారా సాగునీటి నిర్వహణలో రైతుల భాగస్వామ్యాన్ని మళ్లీ బలోపేతం చేశాము.

23. ఇక ముందు బి.ఆర్.ఆర్. వంశధారా దశ-II, ఏవీఆర్ హంద్రి-నీవా, పూల సుబ్బయ్య వెలిగొండ మరియు పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాయలసీమను శాశ్వతంగా కరువు రహిత ప్రాంతంగా మార్చడానికి పోలవరం-నల్లమల సాగర్

అనుసంధానం పై మేము చురుగ్గా దృష్టి సారించాము. రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రం) గా తీర్చిదిద్దే ప్రణాళికలో సాగునీటి సరఫరా ఒక కీలకమైన భాగం.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జల వనరుల శాఖకు 18,224 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవనం, మత్స్య, సహకార రంగాలు**

*"వ్యవసాయం గాడి తప్పితే, మిగతా ఏ రంగానికీ సక్రమంగా నడిచే అవకాశమే ఉండదు."*

-ఎం.ఎస్. స్వామినాథన్

*రైతులే సమాజానికి మూల స్థంభాలు. వారు పండించే ఆహారమే ప్రతి కుటుంబానికి మూలాధారం. అందువల్ల రైతుల సంక్షేమమే మా ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం.*

24. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో, 46.86 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,000 చొప్పున పెంచిన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ మొత్తం రూ.6,660 కోట్లను విడుదల చేశాము.

కొత్తగా అమలు చేసిన జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లపై పన్ను భారం గణనీయంగా తగ్గించబడింది. దీని వల్ల రైతులకు ప్రత్యక్షంగా లాభం చేకూరింది.

25. పశుసంపదకు పొంచివున్న ఆరోగ్యపరమైన ప్రమాదాలను తగ్గించే దిశగా "పశు భీమా పథకం" అమలుకు మేము నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్నాము. పశువైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి కొత్త పశు వైద్య భవనాల నిర్మాణానికి రూ. 20 కోట్లను కేటాయిస్తూ మౌలిక వసతులను విస్తరిస్తున్నాము.

26. అలాగే, గత బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించకపోయినా, మా ప్రభుత్వ సంకల్పం ఎంత స్పష్టమో దానికి నిదర్శనం "మత్స్యకార సేవలో" పథకం అమలు. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని రూ.10,000 నుండి రూ.20,000 కు పెంచాము. దీని ద్వారా సుమారు 1.2 లక్షల మత్స్యకార కుటుంబాలు లాభం పొందుతున్నాయి.

**ధరల స్థిరీకరణ నిధి**

27. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి భారీగా కేటాయింపులు చేసినప్పటికీ, వాటిని సమర్థవంతంగా వినియోగించలేదు. 2019-24 మధ్య కాలంలో ధరల స్థిరీకరణ నిధికి రూ.7,500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ, ఐదేళ్ల కాలంలో కేవలం రూ.880 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. అవసరమైన సందర్భాలలో ప్రభుత్వం ఎంత వేగంగా స్పందించాలనే దానికి మా ప్రభుత్వం ఉదాహరణగా నిలిచింది. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లను మాత్రమే కేటాయించినప్పటికీ, ఒక్క సంవత్సరంలోనే రూ.1,200 కోట్లకు పైగా ఖర్చుచేసి రైతులకు ఉపశమనం కల్పించాము. తోతపురి మామిడి రైతులు, ఉల్లి రైతులు, కోకో గింజల సాగుదారులు, పొగాకు రైతులు తదితరులకు మద్దతు అందించాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ధరల స్థిరీకరణ నిధికి 500 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**సహకార రంగం**

28. పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి సహకార రంగాన్ని పునరుద్ధరించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. ఏప్కాబ్ , డీసీసీబీలు, ప్యాక్స్ (పి.ఎ.సి.ఎస్)లతో కూడిన మూడు అంచెల సహకార వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూర్చాము. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 53.2 లక్షల సభ్యులకు సేవలు అందిస్తూ, రూ.7,600 కోట్లకు పైగా వ్యవసాయ రుణాలను మంజూరు చేశాయి. ముఖ్యమైన సాధనగా, మొత్తం 2,021 ప్యాక్స్‌లను డిజిటలైజ్ చేయగా, వాటిలో 2,017 సంఘాలు ఈ-ప్యాక్స్‌గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీనివల్ల సేవల అందించడంలో ఆలస్యం గణనీయంగా తగ్గి, పారదర్శకత పెరిగింది.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు 13,598 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించే సందర్భంగా ఇందుకు సంబంధించిన వివరాలను నా సహచర మంత్రి గారు సభకు సమగ్రంగా తెలియజేస్తారు.

**పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి & శిక్షణ**

*విద్యను ఉద్దేశించి నెల్సన్ మండేలా గారి మాటలలో...*

*"ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించగల*

*అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య."*

29. విద్య అనేది కేవలం భవనాలు, పాఠ్య ప్రణాళికలు లేదా పరీక్షలకే పరిమితం కాదు. తన బిడ్డ మంచి భవిష్యత్తును సాధిస్తాడనే నమ్మకంతో ఉన్న తల్లి కళ్లలో కనిపించే ఆశే విద్య. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థి వైద్యుడు, ఇంజనీరు, ఉపాధ్యాయుడు లేదా సివిల్ సర్వెంట్ కావాలని కలలు కనే సంకల్పమే విద్య. మా ప్రభుత్వం విద్యను కేవలం పరిపాలనా బాధ్యతగా కాకుండా, ఒక నైతిక కట్టుబాటుగా పరిగణిస్తుంది. మా దృష్టిలో పాఠశాలలను నిర్మించడం అంటే భవిష్యత్తును నిర్మించడం. శ్రీ నారా లోకేష్ గారి నాయకత్వంలో మన రాష్ట్రంలో విద్యా దృక్పథం లక్ష్యసాధన దిశగా దృష్టిసారిస్తోంది. పిల్లలు గ్లోబల్ స్థాయిలో పోటీపడగల నైపుణ్యాలతో సిద్ధమవుతున్నారు.

30. 2019-24 మధ్యకాలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రమైన విద్యా మరియు సంస్థాగత వెనుకబాటుకు గురైంది. సమగ్ర ప్రణాళిక లేకుండా చేపట్టిన సంస్కరణలు గందరగోళాన్ని సృష్టించాయి. తొందరపాటు నిర్ణయంతో 1,000 పాఠశాలలను సీబీఎస్ఈ విధానానికి మార్చడం వల్ల

సుమారు 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఉపాధ్యాయుల సన్నద్ధత లేకపోవడంతో టోఫెల్ కార్యక్రమం విఫలమైంది. అమలు సాధ్యాసాధ్యాలు పరిగణలోకి తీసుకోకుండా ప్రతిపాదించిన ఐబీ పాఠ్య ప్రణాళికపై ప్రజాధనం వృథా అయింది. “నాడు-నేడు” కార్యక్రమంలో పరిపాలనా వైఫల్యం కారణంగా రూ.7,876 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

31. జూన్ 2024 నుండి మా ప్రభుత్వం విద్యారంగంలో సమగ్ర, ఫలితాలపై దృష్టి కేంద్రీకరించిన సంస్కరణలను ప్రారంభించింది. తల్లికి వందనం, మన బడి-మన భవిష్యత్తు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పారిశుధ్యం మరియు నిర్వహణ నిధులు, పాఠ్య ప్రణాళిక మార్పులు, డిజిటల్ లెర్నింగ్, ఉపాధ్యాయుల సామర్థ్య వృద్ధి, పరిపాలనా పునర్వ్యవస్థీకరణ వంటి ప్రధాన కార్యక్రమాల ద్వారా అభ్యసన సామర్థ్యాలను ఫలితాలను మరియు గ్లోబల్ పోటీతత్వాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాము. “లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్” (LEAP) క్రింద 'KGటుPG' విద్యా సంస్కరణ నమూనాను ప్రారంభించాము.

32. సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా 2025-26లో ప్రవేశపెట్టిన “తల్లికి వందనం” పథకం కింద ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15,000 చొప్పున అందజేసి, 67.27 లక్షల మంది విద్యార్థులకు లాభం చేకూర్చాము.

33. పరిపాలనా పారదర్శకతను మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు, పాఠశాల స్టార్ రేటింగ్ వ్యవస్థ, సమాజ భాగస్వామ్యం ద్వారా బలోపేతం చేశాము. అనేక సంవత్సరాలుగా వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండేవి. మెగా డీఎస్సీ-2025 ద్వారా నోటిఫై చేసిన 16,347 పోస్టుల్లో 15,941 ఉపాధ్యాయ పోస్టులను విజయవంతంగా భర్తీ చేశాము.

*"ఉపాధి, గౌరవం మరియు అవకాశాలు*
*సృష్టించినప్పుడే వృద్ధికి అర్థం ఉంటుంది."*

34. భవిష్యత్ ఉపాధి అవసరాలకు అనుగుణంగా సమగ్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను రూపొందిస్తున్నాము. విద్య, పరిశ్రమలు మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల మధ్య సమన్వయంపై దృష్టి సారిస్తున్నాము. ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించేందుకు అన్ని ప్రభుత్వ ఐ.టీ.ఐ.లు 167 పరిశ్రమ భాగస్వాములతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 9,188 మంది శిక్షణార్థులు పరిశ్రమల్లో ప్రత్యక్ష శిక్షణ పొందగా, ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల్లో 98 శాతం మంది నియామకాలు లేదా అప్రెంటిస్ అవకాశాలను పొందారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నేను క్రింది విధంగా కేటాయింపులను ప్రతిపాదిస్తున్నాను:

పాఠశాల విద్యాశాఖకు రూ. 32,308 కోట్లు, అందులో ప్రజా పాఠశాలల మౌలిక వసతుల సమగ్ర అభివృద్ధికి రూ.1,500 కోట్లు.

ఉన్నత విద్యాశాఖకు రూ.2,567 కోట్లు.

నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖకు రూ.1,232 కోట్లు.

**పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి**

35. గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కె. పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ముఖచిత్రం' రూపాంతరం చెందుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3.44 లక్షల ఎన్నికైన ప్రజాప్రతినిధులు మరియు కార్యనిర్వాహకులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా ప్రథమ స్థానాన్ని సాధించింది.

36. 15 ఆగస్టు 2019 నుండి 2024-25 వరకు అమలులో ఉన్న జల్ జీవన్ మిషన్ కింద, గత ప్రభుత్వం మొత్తం రూ.26,824 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర భాగస్వామ్యంగా లభించిన నిధుల్లో కేవలం రూ.2,255 కోట్లను మాత్రమే వినియోగించింది. 2023-24లో కేంద్రం నుండి తక్కువ కేటాయింపులు వచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గుజరాత్, ఒడిశా వంటి రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ కంటే ఎక్కువగా ఖర్చు చేశాయి. మా ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించేందుకు ముందడుగు వేసింది. మా విజ్ఞప్తిని స్వీకరించి పథకం గడువును 2028 వరకు పొడిగించిన భారత ప్రభుత్వానికి

మా కృతజ్ఞతలు. దీర్ఘకాలిక స్థిరత్వ సమస్యలను పరిష్కరించడంతో పాటు 100 శాతం కవరేజీ సాధించేందుకు ఉపరితల జల ఆధారిత మల్టీ విలేజ్ స్కీమ్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించాము. ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల తాగునీటి సరఫరాను నిర్ధారించే దిశగా చర్యలు తీసుకుంటున్నాము.

37. గ్రామీణ అనుసంధానతను బలోపేతం చేస్తూ 4,000 కిలోమీటర్ల పైగా గ్రామీణ రహదారుల పనులను చేపట్టుట జరిగినది. వీటిలో అనేక పనులు పూర్తి చేయుట జరిగినది మరియు మిగతా పనులు ముగింపు దశలో ఉన్నాయి. దీని ద్వారా దూరప్రాంత గ్రామాల్లో మార్కెట్ ప్రాప్తి, ఆదాయవృద్ధి మరియు ఆర్థిక స్థిరత్వం మెరుగుపడుతోంది. SASCI క్రింద రూ.2,123 కోట్లను కేటాయించాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 22,942 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**పర్యావరణం, అటవీ, విజ్ఞాన శాస్త్రం & సాంకేతిక శాఖ**

38. 2019-24 మధ్యకాలంలో పరిపాలనా వైఫల్యాల కారణంగా ఎర్రచందనం అక్రమ రవాణా, అక్రమ గనుల తవ్వకం, అటవీ భూముల ఆక్రమణ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను 'హరిత

ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం మా లక్ష్యం. 2030 నాటికి 37 శాతం మరియు 2047 నాటికి 50 శాతం పచ్చదనం సాధించే దిశగా అటవీ సంపదను స్థిరంగా నిర్వహించడం, ఎడారీకరణను ఎదుర్కోవడం వంటి చర్యలను అమలు చేస్తాము. వ్యూహాత్మక పర్యావరణ రక్షణ వలయంగా 'గ్రీన్ కవర్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'ను అమలు చేయనున్నాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పర్యావరణం, అటవీ, విజ్ఞాన శాస్త్రం & సాంకేతిక శాఖకు 714 కోట్ల రూపాయల కేటాయించాలని నేను ప్రతిపాదిస్తున్నాను.

**పట్టణాభివృద్ధి**

39 అమృత్ 2.0 పథకం కింద 117 పట్టణ స్థానిక సంస్థలలో మొత్తం 506 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. అదనంగా UIDF మరియు AIIB సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నిటినీ 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాము. ఈ సందర్భంలో, రెండు సంవత్సరాల వ్యవధిలో UIDF కింద ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా రూ.4,000 కోట్లను మంజూరు చేయడంలో సహకరించిన గౌరవ కేంద్ర ఆర్థిక మంత్రి గారికి మా కృతజ్ఞతలు.

40. 1982 లోనే స్వర్గీయ శ్రీ ఎన్.టి. రామారావుగారు ఆహార భద్రతా ప్రాధాన్యతను గుర్తించారు. అదే స్ఫూర్తితో మా ప్రభుత్వం ప్రస్తుతం 204 అన్న

క్యాంటీన్లను నిర్వహిస్తోంది. 2026 మార్చి నాటికి వాటి సంఖ్యను 275కు పెంచి, అతి పేద ప్రజలకు కూడా తగిన ఆహారం అందుబాటులో ఉండేలా చేసి ఆకలిని నివారించడమే మా లక్ష్యం.

41. విశాఖపట్నం మరియు విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఆధునిక మెట్రో రైలు వ్యవస్థలో ప్రయాణించే కల త్వరలో సాకారం కానుంది.

42. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ)-ఎన్.టి.ఆర్ నగర్స్ క్రింద ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు 25 లక్షల గృహ పట్టాలు/ ఇళ్లను అందించి, సొంత ఇంటి కలను నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం.

**అమరావతి - ప్రజల రాజధాని**

43. మా ప్రజల రాజధాని అమరావతి అభివృద్ధికి మద్దతు అందించిన గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా కల్పించే ప్రక్రియ ప్రారంభించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు. వివిధ ఆర్థిక సంస్థల ద్వారా స్వయం-సమృద్ధి (Self-sustaining) నమూనాలో నిధులను సమీకరించి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నాము. రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేశాము. ఇది మా ప్రభుత్వం ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే నిబద్ధతకు స్పష్టమైన నిదర్శనం.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గానుమున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖకు 14,539 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**న్యాయశాఖ, హోమ్, మద్యనిషేధం & ఎక్సైజ్, అగ్నిమాపక శాఖలు**

*"మంచివారు భయపడనప్పుడు చెడు శక్తులు బలహీనమవుతాయి."*

- అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్

44. తీవ్ర వాతావరణ పరిస్థితుల్లోనూ, పండుగల సమయంలోనూ, అత్యవసరాలు, విపత్తులు, ప్రజా కార్యక్రమాల సమయంలోనూ వ్యక్తిగత అవసరాలను పక్కన పెట్టి రాత్రింబగళ్లు కర్తవ్యాన్ని నిర్వర్తించేది మన పోలీసు దళమే. ఖాకీ యూనిఫామ్ గౌరవం మరియు హుందాతనాన్ని భుజాన మోస్తూ, ఏదైనా ఆపద వస్తే మొదటిగా స్పందించేది వారే. వారి సేవాభావం, త్యాగస్ఫూర్తిని మా ప్రభుత్వం అత్యంత గౌరవంగా భావిస్తుంది. గత పాలనలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు హామీ మేరకు, శాంతిభద్రతల యంత్రాంగాన్ని సమూలంగా మార్చడానికి ఈ క్రింది ఆధునీకరణ మరియు సంక్షేమ చర్యలు తీసుకుంటున్నాము.

- పోలీసు శాఖకు 3,000 కొత్త వాహనాలను త్వరలో అందించనున్నాము.
- డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి ఆధునిక నేరాలను ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తాము.
- స్మార్ట్ పోలీసింగ్ ల్యాబ్‌ల స్థాపన, కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాజెక్టులు, ఆధునిక కమ్యూనికేషన్ & భద్రతా పరికరాలు, సీసీటీవీ మరియు డ్రోన్ వినియోగంతో సాంకేతికంగా దృఢమైన పోలీసు వ్యవస్థను నిర్మిస్తున్నాము.
- కొత్త ఏపీ పోలీస్ అకాడమీ స్థాపన కోసం 94 ఎకరాలు కేటాయించాం. నిర్మాణ పనుల ప్రారంభానికి ఈ సంవత్సరంలో రూ.15 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాము.
- శ్రీకాకుళం, రాజమండ్రి, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో 4 కొత్త **ఇండియా రిజర్వ్ ఏపీఎస్పీ బెటాలియన్**లను ప్రారంభించి 3,920 పోస్టులను మంజూరు చేశాము.
- పౌర-పోలీసు నిష్పత్తిని మెరుగుపరచేందుకు 5,757 స్టైపెండరీ కేడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లను నియమించాము. శిక్షణ సమయంలో వారికి ఆర్థిక మద్దతుగా నెలవారీ భత్యాన్ని రూ.4,500 నుండి రూ.12,000కు మూడు రెట్లు పెంచినట్లు గౌరవ ముఖ్యమంత్రి ప్రకటించారు.

- పోలీసు సిబ్బందికి బకాయి ఉన్న టీఏ, డీఏలు, సెలవు సంబంధిత బకాయిలు, వైద్య రీయింబర్స్‌మెంట్‌లు తదితర చెల్లింపుల కోసం దాదాపు రూ.500 కోట్లను విడుదల చేశాము.
- పీసీ నుండి డీజీపీ వరకు రూ.20 లక్షల నుండి రూ.45 లక్షల వరకు ఉచిత బీమా కవరేజీ కల్పించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాము.
- గత ఐదేళ్లుగా విస్తరించిన గంజాయి సమస్యను ప్రత్యేక విభాగం "ఈగల్" ద్వారా మరియు డ్రోన్ల వినియోగంతో కట్టడి చేస్తున్నాము.
- మహిళల భద్రత కోసం 'శక్తి యాప్'ను ప్రారంభించాము. దీని ద్వారా 7 నిమిషాలలోనే స్పందన (Response) లభిస్తుంది మరియు వేధింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.

45. జిల్లా న్యాయవ్యవస్థ కోసం కోర్టు భవనాలు మరియు నివాస గృహాల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాము. న్యాయవ్యవస్థకు రూ.349 కోట్ల విలువైన పనులను మంజూరు చేశాము. 2026-27లో తొలి దశలో 100 కొత్త కోర్టులను కూడా ఆమోదించాము.

46. పునర్వ్యవస్థీకరించిన ఎక్సైజ్ విధానంతో మద్యం రంగంలో లీకేజీలను పూర్తిగా నివారించాము. అవినీతి లేకుండా ఆదాయం రాష్ట్ర ఖజానాకు సక్రమంగా చేరుతోంది.

47. అగ్నిమాపక సేవల ఆధునికీకరణలో భాగంగా 17 కొత్త అగ్నిమాపక కేంద్రాలను స్థాపిస్తున్నాము. స్పందన సమయాన్ని తగ్గించేందుకు అత్యాధునిక శోధన మరియు రక్షణ పరికరాలతో కూడిన అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేస్తాము. రాష్ట్ర శిక్షణ కేంద్రాన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా బలోపేతం చేస్తాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి హోమ్ శాఖకు రూ.9,165 కోట్లను కేటాయించాలని నేను ప్రతిపాదిస్తున్నాను.

అదేవిధంగా, మద్యనిషేధం మరియు ఎక్సైజ్ శాఖకు రూ.500 కోట్లను కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాను.

మరియు, మా ప్రభుత్వం తీసుకున్న కొన్ని ముఖ్యమైన చర్యలను ఈ సందర్భంగా ప్రస్తావించదలిచాను.

**ఆర్థిక శాఖ తీసుకున్న చర్యలు**

48. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జాగ్రత్తగా నిర్వహిస్తూ ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని క్రింది చర్యలు స్పష్టంగా చూపిస్తున్నాయి:

i. గత ప్రభుత్వం అత్యధికంగా 12.3 శాతం వరకు ఉన్న వడ్డీ రేట్లపై అప్పులు తీసుకుంది. రాష్ట్ర ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు అధిక వడ్డీ రుణాలను 9 శాతం లేదా అంతకంటే తక్కువకు తీసుకురావడానికి వడ్డీ రేట్ల తగ్గింపు, డెబ్ట్ స్వాపింగ్ వంటి చర్యలను చేపడుతున్నాము.

ఇప్పటివరకు రూ.43,298 కోట్ల రుణాలకు వడ్డీని తగ్గించి, సంవత్సరానికి రూ.327 కోట్ల ఆదాచేసాము. అదనంగా మరో రూ.1.2 లక్షల కోట్ల రుణాలపై మెరుగైన షరతులు పొందేందుకు చర్చలు కొనసాగిస్తున్నాము. దీని ద్వారా సంవత్సరానికి సుమారు రూ.1,658 కోట్ల ఆదా కలుగుతుందని అంచనా.

ii. పంచాయతీలు మరియు మున్సిపాలిటీలను బలోపేతం చేయడానికి ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద రూ.3,797 కోట్లను విడుదల చేశాము.

iii. 12 జూన్ 2024 నాటికి పెండింగ్‌లో ఉన్న రూ.24,811 కోట్ల బకాయిలను క్లియర్ చేశాము.

iv. సాగునీరు, రహదారులు మరియు ఇతర పనులకు రూ.37,030 కోట్లను చెల్లించి ఆర్థిక కార్యకలాపాలను పునరుద్ధరించాము.

v. 163 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.18,701 కోట్లను విడుదల చేసి, వాటిలో 85 పథకాలను పునరుద్ధరించాము. దీని ఫలితంగా కేంద్ర ప్రభుత్వ నిధుల విడుదల మరింత పెరిగింది.

vi. ఆంధ్రప్రదేశ్ వెల్త్ ఫండ్‌ను రూ.100 కోట్ల సీడ్ కార్పస్‌తో ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నాము. దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడిదారులను ఆహ్వానించి రాష్ట్రానికి సంపద సృష్టించే దిశగా ముందుకు సాగుతున్నాము.

**సంస్కరణలు**

i. "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" సిద్ధాంతానికి అనుగుణంగా ప్రభుత్వంలోని చట్టాలు, నియమాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులను సమీక్షించి పరిపాలనా ప్రక్రియలను సరళీకరించి పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరియు పౌర సేవల మెరుగుదలను కల్పిస్తున్నాము. ఇదే దిశలో ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించి, వాటి ఖాతాలు మరియు ఆడిట్ వ్యవస్థను క్రమబద్ధీకరించి లాభదాయకంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ii. కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ సంస్థలు TReDS డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా బిల్ డిస్కౌంటింగ్ విధానాన్ని అనుసరిస్తాయి.

iii. SASCI కింద 2025-26లో 12 ఫిబ్రవరి 2026 నాటికి ఆంధ్రప్రదేశ్ రూ.6,544 కోట్లను పొందింది. మార్చి 31 నాటికి మరో రూ.1,438 కోట్లు అందుకోనుంది. ఇది 2023-24లో పొందిన రూ.4,090 కోట్లతో పోలిస్తే దాదాపు రెట్టింపు.

iv. దేశంలో తొలిసారిగా "రీ-ఇమాజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్"ను నవంబర్ 2025లో విశాఖపట్నంలో నిర్వహించాము. ఈ సమ్మిట్‌లో

ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ మరియు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రెండు రోజుల చర్చల ఫలితంగా ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ స్థాపనకు దారి తీసింది. అలాగే పబ్లిక్ సెక్టార్‌లో వినూత్న ఆర్థిక నమూనాల ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే మార్గాలు ఏర్పడ్డాయి.

**భవిష్యత్ విధానాలు**

జూన్ 2024 నుండి రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పోటీతత్వంతో ముందుకు తీసుకెళ్లేందుకు 26 పునర్వ్యవస్థీకరించిన విధానాలను ప్రవేశపెట్టాము. వాటిలో ముఖ్యమైనవి:

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం (4.0)

ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ &

పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విధానం (4.0)

ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం

ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ & స్టార్టప్ విధానం (4.0)

ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం

ఈ విధానాలు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూలమైన, స్థిరమైన మరియు సమగ్ర అభివృద్ధి సాధించే రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు తీసుకెళ్తాయి.

**పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు & పెట్టుబడులు, సమాచార సాంకేతికం, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ - ఆవిష్కరణలు మరియు భవిష్యత్ సంసిద్ధత**

*'నేడు కృషిచేసిన వారిదే రేపటి భవిష్యత్తు'*

*-- మాల్కమ్ ఎక్స్*

49. నేటి పెట్టుబడే రేపటి ఉపాధి అని మేము విశ్వసిస్తున్నాము. వ్యూహాత్మక ప్రణాళికలు మరియు నిరంతర సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలు మరియు ఆవిష్కరణలకు అగ్రగామి గమ్యస్థానంగా నిలబెట్టేందుకు కట్టుబడి ఉన్నాము. 2019-24 మధ్యకాలంలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా దెబ్బతింది. అయితే, మా ప్రభుత్వ అచంచల కృషితో కేవలం 18 నెలల్లో “బ్రాండ్ ఆంధ్ర”ను పునరుద్ధరించాము. జూన్ 2024 నుండి రూ.9.68 లక్షల కోట్ల విలువైన 1.19 లక్షల పెట్టుబడి ప్రతిపాదనలు ఆమోదించబడి, 5.41 లక్షల ఉద్యోగావకాశాల సృష్టికి మార్గం సుగమమైంది.

50. మా విజన్-“ప్రపంచంతో పోటీ.... స్థానికంగా చేయూత” (Competes Globally and Cares Locally). ఇటీవల నిర్వహించిన **గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025** లో రూ.13.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయి. 16.13 లక్షల ఉద్యోగావకాశాల సామర్థ్యంతో 610 ఎంఓయూలు సంతకం చేయబడ్డాయి.

51. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద సింగిల్ ఎఫ్.డి.ఐ. పెట్టుబడిని ఆకర్షించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గురించి ప్రపంచం మాట్లాడుతోంది. గట్టి అంతర్జాతీయ, జాతీయ పోటీ మధ్య విశాఖపట్నంలో గూగుల్ సంస్థతో 15 బిలియన్ డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లు) విలువైన ఏ.ఐ. ఆధారిత డేటా సెంటర్ స్థాపనకు ఒప్పందం కుదుర్చుకున్నాము. గౌరవ ఐటీ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు “బ్రాండ్ చంద్రబాబు”ని సమర్థంగా వినియోగించి ఈ చారిత్రక ఒప్పందాన్ని సాధించారు. ఆయనను ‘ఆంధ్రప్రదేశ్ చీఫ్ జాబ్ క్రియేటర్’గా కొనియాడటం సముచితం. అదనంగా అనకాపల్లిలో సమగ్ర ఉక్కు కర్మాగారం, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్, సమగ్ర సౌర సెల్ ప్రాజెక్ట్, 500 సీబీజీ ప్లాంట్లు, కాకినాడలో గ్రీన్ అల్యూమినియం ప్రాజెక్ట్, ఓర్వకల్లో సెమీకండక్టర్ యూనిట్ వంటి ప్రముఖ పెట్టుబడులు ఆకర్షించగలిగాము. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు మరియు కృష్ణపట్నం, ఓర్వకల్, కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లు అభివృద్ధి చెందుతున్నాయి.

52. రామాయపట్నం (75%), మూలపేట (65%), మచిలీపట్నం (50%), కాకినాడ ఎస్ఈజెడ్ పోర్ట్ (32%) వంటి కొత్త పోర్టు ప్రాజెక్టులు వేగంగా పురోగమిస్తున్నాయి. రూ.1,523 కోట్లతో ఫేజ్-I మత్స్యకార హార్బర్ల ఆధునీకరణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. అలాగే సాగర్‌మాల 2.0 సహకారంతో ఫేజ్-II హార్బర్లను ఈపీసీ పద్ధతిలో పునఃటెండర్ చేసి సకాలంలో పూర్తిచేయడానికి చర్యలు చేపట్టాము.

53. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం"గా మార్చబడింది. ఇది 97% పూర్తి అయింది. కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో 300 ఎకరాల్లో దేశంలో తొలి సమగ్ర డ్రోన్ సిటీని అభివృద్ధి చేస్తున్నాము.

54. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను రాష్ట్ర ప్రధాన నవకల్పనల వేదికగా స్థాపించబడింది.

55. అమరావతి క్వాంటమ్ వ్యాలీ మరియు క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ స్థాపన ద్వారా ఆంధ్రప్రదేశ్ డీప్-టెక్ రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. 1990లలో ఐటీ విప్లవం ద్వారా లాభపడిన తరానికి పోలికగా, నేటి యువత రేపటి సాంకేతిక విప్లవాల ద్వారా లాభపడనున్నారు.

56. 36కి పైగా శాఖలు, 139 డేటాబేస్‌ల సమగ్ర సమన్వయంతో ఏపీ స్టేట్ డేటా లేక్ ద్వారా డేటా ఆధారిత పరిపాలనను బలోపేతం చేశాము. "మన మిత్ర" (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను 150 నుండి 900కి పైగా పెంచి పౌరులకు వేగవంతమైన సేవలను అందిస్తున్నాము. దీని ద్వారా పౌరుల ప్రభుత్వ కార్యాలయాల భౌతిక సందర్శన గణనీయంగా తగ్గడమే కాకుండా నిర్ధారించిన సమయంలో సేవలను పొందగలుగుతున్నారు.

57. 1 ఏప్రిల్ 2026 నుండి చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

అందించనున్నాము. దీనివల్ల 1 లక్షకు పైగా కుటుంబాలు లాభపడతాయి.

పరిశ్రమలు & వాణిజ్య శాఖకు రూ. 3,161 కోట్లు

మౌలిక సదుపాయాలు & పెట్టుబడుల శాఖకు రూ.1,283 కోట్లు

సమాచార సాంకేతికం, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్ శాఖకు రూ.536 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**పౌర సరఫరాలు**

58. దీపం 2.0 కింద 1.08 కోట్ల మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లను అందిస్తూ రూ.2,897 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశాము.

59. ధాన్యం కొనుగోళ్లలో దేశానికి ఆదర్శంగా నిలిచాము. 12 ఫిబ్రవరి 2026 నాటికి 8.54 లక్షల రైతుల ఖాతాల్లో రూ.10,580 కోట్లు జమ అయ్యాయి. ఒకే రోజు రికార్డు స్థాయిలో రూ.9,740 కోట్ల నగదు వారి ఖాతాల్లోకి జమచేయుట జరిగింది. అందులో 55% మొత్తాన్ని 8 గంటల్లో చెల్లించడం మా వేగం, పారదర్శకతకు నిదర్శనం.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పౌర సరఫరాల శాఖకు 3,821 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**సామాజిక సంక్షేమం, గిరిజన, బీసీ, మైనారిటీల సంక్షేమం**

అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు; గౌరవప్రదమైన జీవనమే అసలైన అభివృద్ధి.

60. గౌరవనీయ ముఖ్యమంత్రి గారి హృదయానికి అత్యంత సన్నిహితమైన అంశం 'సంక్షేమం'. సంక్షేమం అనేది కేవలం దాతృత్వం కాదని, అది సమానత్వం, గౌరవం మరియు సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావమని ఆయన బలంగా నమ్ముతారు. సంక్షేమ కార్యక్రమాలను స్వర్ణాంధ్ర@2047 లక్ష్యాలతో అనుసంధానిస్తూ, విద్య, ఆదాయ భద్రత మరియు ఆత్మగౌరవమే కేంద్రబిందువుగా ఆయన పాలన సాగిస్తున్నారు.

**NTR భరోసా పెన్షన్ల పంపిణీ:**

రాష్ట్ర సంక్షేమ చరిత్రలో 'NTR భరోసా' పెన్షన్ల పంపిణీ ఒక మైలురాయి. లక్షలాది కుటుంబాలకు పెద్ద కొడుకులా, గౌరవనీయ ముఖ్యమంత్రి గారు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందజేస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా, డీబీటీ (ఐడీ) ద్వారా రూ. 4,000 నుండి రూ. 15,000 వరకు పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. గత 19 నెలల్లో రూ. 58,000 కోట్ల కంటే ఎక్కువ విలువైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది.

61. ఆర్థిక ఒత్తిడి ఉన్నప్పటికీ "సూపర్ సిక్స్"ను విజయవంతంగా అమలు చేశాము. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్, ఆటో డ్రైవర్ సేవలో, మత్స్యకార సేవలో, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాము.

62. జూన్ 2024 నుండి ఇప్పటివరకు మేము చేపట్టిన 743 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు మరియు రెసిడెన్షియల్ పాఠశాలల పునరుద్ధరణలో పిల్లల పట్ల మా ప్రభుత్వం చూపే శ్రద్ధ స్పష్టంగా కనపడుతుంది. పిల్లలు మంచిగా చదువుకోవటానికి స్వచ్ఛమైన తాగునీరు, CCTV, రియల్-టైమ్ పర్యవేక్షణలు కల్పించి వారి ఆరోగ్యం మరియు భద్రతా వ్యవస్థలు మెరుగు పరుస్తున్నాము. వీరికి మరింత సౌకర్యాల కల్పనకు హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలల నేను 300 కోట్ల రూపాయల కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాను.

63. 2025-2026 మధ్యకాలంలో వివిధ పథకాల ద్వారా మైనారిటీల సంక్షేమం కోసం మేము 3,766 కోట్ల రూపాయలు ఖర్చు చేశాము. చాలా కాలం క్రితం మూలన పడిన ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమ్‌ను పునరుద్ధరించాము. 3 సంవత్సరాలుగా నిద్రాణంగా ఉన్న రాష్ట్ర వక్ఫ్ బోర్డును మేము పునరుద్ధరించాము. మైనార్టీలకు ఆర్థిక సహాయములో భాగముగా ఇమామ్‌లకు గౌరవ వేతనం (రూ.10,000) మౌజమ్లకు (రూ.5,000), పాస్టర్‌లకు (రూ.5,000) మరియు చదువులో వెనుకబడిన విద్యార్థులకు

ఎంట్రన్స్ కోచింగ్ వంటి కార్యక్రమాల ద్వారా, మా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ వర్గాల విద్యా పురోగతి, ఆర్థిక సాధికారత మరియు సామాజిక అంశాల పై దృష్టి సారించింది.

64. ఉన్నత విద్య మరియు వృత్తి విద్యను అభ్యసించే BC విద్యార్థులకు పూర్తి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్, అలాగే పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు నిర్వహణ భత్యం ఇవ్వబడుతోంది. మేము కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలలో 10% రిజర్వేషన్లు కల్పించాము. నాయీ బ్రాహ్మణుల సెలూన్‌లకు ఉచిత విద్యుత్‌ను నెలకు 200 యూనిట్లకు పెంచాము. వడ్డెర కులస్తులకు మైనింగ్ లీజులలో 15% రిజర్వేషన్లు మరియు సీనరేజ్ ఛార్జీలపై 50% సబ్సిడీని కల్పించాము.

**మహిళా సంక్షేమం**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇలా అన్నారు:

*"ఒక సమాజం యొక్క పురోగతిని మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను కొలుస్తాను"*

65. స్వర్గీయ శ్రీ. ఎన్.టి. రామారావు గారు మహిళలకు ఆస్తి హక్కులో సమాన వాటా కల్పించగా, మా ప్రభుత్వం ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేసింది.

66. స్వర్ణ ఆంధ్ర @2047 దార్శనికతను సాధించడంలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తారు. సంవత్సరానికి ఆశించిన 15% వృద్ధి రేటును సాధించడానికి ఆర్థిక కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం చాలా ముఖ్యం. గౌరవనీయ ముఖ్యమంత్రి ఒక సంవత్సరంలో 1 లక్ష మంది మహిళా వ్యవస్థాపకులను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. One Family-One Entrepreneur చొరవ కింద, స్వయం సహాయక సంఘాల మహిళలను చిన్న & మధ్య తరహా వ్యవస్థాపకులుగా మార్చుతున్నారు. జూన్ 2024 నుండి మేము ప్రవేశపెట్టిన అనేక సంస్కరణల ద్వారా మహిళలకు అనేక ప్రోత్సాహకాలను అందించాము.

67. ప్రస్తుత సంవత్సరంలో, మా ప్రభుత్వం 9,958 అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. 4,687 మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశాము. అప్‌గ్రేడ్ చేయబడిన అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ సహాయకులను నియమించి వంట సౌకర్యాలు మెరుగుపరచబడ్డాయి. ప్రధానమంత్రి జనమన్ కింద, పి.వి.టి.జి. ప్రాంతాలలో 192 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయబడ్డాయి. ఇవి 2026-27లో పూర్తవుతాయి

68. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు మరియు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు కీలకమైన సేవలను అందిస్తారు. అందుకుగాను వారి సుదీర్ఘ సేవలను గౌరవిస్తూ, మా ప్రభుత్వం వారి పదవీ విరమణ సమయములో గ్రాట్యుటీని అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది.

69. గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో, వికలాంగుల సమగ్ర అభివృద్ధి కోసం **'ఇంద్రధనస్సు'** అను కార్యక్రమం ప్రారంభించబడింది. ఇందులో భాగముగా ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ పథకాల పునరుద్ధరణ, క్రీడా శిక్షణ, గృహనిర్మాణం, వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక డిగ్రీ కళాశాల మరియు దివ్యాంగుల భవనాలు వంటి ప్రధాన అంశాలు ఉన్నాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి, నేను ఈ కేటాయింపులను ప్రతిపాదిస్తున్నాను:

SC కాంపోనెంట్ కోసం రూ.20,644 కోట్లు

ST కాంపోనెంట్ కోసం రూ.9,190 కోట్లు

BC కాంపోనెంట్ కోసం రూ.51,021 కోట్లు

మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం రూ.6,090 కోట్లు

మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ కోసం రూ.4,582 కోట్లు

**ఉద్యోగుల సంక్షేమం**

i. ఉద్యోగ సంఘాల నుండి సలహాలు సూచనలను కోరిన తర్వాత ఉద్యోగుల భవిష్య నిధి మరియు పెన్షన్ ప్రక్రియలను సజావుగా మరియు కాగిత రహితంగా చేస్తున్నాము.

ii. ఈ -డి.పి.సి మాడ్యూల్ ద్వారా ప్రమోషన్ ప్రక్రియ ఆన్‌లైన్ చేయబడింది.

iii. ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను కూడా చెల్లించడం ప్రారంభించింది. 1,100 కోట్ల రూపాయల DA మరియు DR బకాయిలను విడుదల చేశాము .

iv. GPF మరియు GLI చెల్లింపులు క్రమం తప్పకుండా చేయబడు తున్నాయి. CPS ఉద్యోగులకు వారి PRAN అకౌంట్‌లో ప్రభుత్వ వాటాతో కలిపి ఎప్పటికప్పుడే కంట్రిబ్యూషన్ జమ చేస్తున్నాము.

v. మహిళా ఉద్యోగులకు వారి వృత్తి మరియు వ్యక్తిగత జీవితాలలో సమతుల్యతను పెంపొందించే దిశగా, సర్వీసులో ఎప్పుడైనా పిల్లల సంరక్షణ సెలవులను పొందేందుకు వీలుగా పిల్లల వయోపరిమితిని తొలగించాము.

vi. ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో ప్రభుత్వ నిబంధనలకు మించి వారికీ భీమా ప్రయోజనాలను అందించడానికి, రాష్ట్ర ప్రభుత్వ జీతం ప్యాకేజీ క్రింద మా ప్రభుత్వం బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకుంది.

vii. మా ప్రభుత్వం వివిధ కేటగిరీలలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేసింది.

**ఆరోగ్యం**

70. గత ప్రభుత్వ హయాంలో, బకాయిలు చెల్లించని కారణముగా ఆరోగ్య వ్యవస్థలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. దీనితో చాలా కుటుంబాలపై ఆర్థిక భారం మోపబడి ఆర్థికంగా, మానసికముగా చాలా బాధపడ్డారు. గత ప్రభుత్వం ఆరోగ్య రంగానికి చెల్లించవలసిన 6,486 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా వదిలివేసింది. వీటిలో ఎక్కువ భాగము మా ప్రభుత్వం చెల్లించి ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం కల్పించింది. వ్యాధి చికిత్స కన్నా నివారణే ముఖ్యమని మేము నమ్ముతున్నాము. నివారణ వలన ఆరోగ్య అవసరాలపై జేబులోంచి ఖర్చును గణనీయంగా తగ్గిస్తుంది. మా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, పౌరుడిని ఆరోగ్య సంరక్షణలో కేంద్రంగా **ప్రాజెక్ట్ సంజీవని** చేపట్టింది. కుప్పంలో **సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్** పైలట్ క్రింద 41 రోగనిర్ధారణ పరీక్షలను కవర్ చేసి, 63,867 మంది వ్యక్తులను పరీక్షించింది. 6,300 కంటే ఎక్కువ హై-రిస్క్ కేసులను గుర్తించి వాటిని ప్రాజెక్ట్ సంజీవనికి అనుసంధానించింది.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు 19,306 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**కార్మిక శాఖ**

71. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక సంస్కరణలకు అనుగుణంగా మా ప్రభుత్వం పాత చట్టాలను సమీకరించి నూతన కార్మిక కోడ్స్‌ను అమలు చేసింది. కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడానికి కొత్త ఈఎస్ఐ వైద్యసేవా సదుపాయాలను ప్రారంభిస్తున్నాము. విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో 100 పడకల ఆసుపత్రులు, కర్నూలు, శ్రీ సిటీ, అచ్యుతాపురం, శ్రీకాకుళం ప్రాంతాల్లో 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయబడుతున్నాయి. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు విస్తరించడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో ద్వితీయ శ్రేణి వైద్య సేవల అందుబాటు గణనీయంగా మెరుగుపడింది.

2026-27 ఆర్థిక సంవత్సరానికి కార్మిక శాఖకు 735 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**గృహ నిర్మాణం**

72. 2019-24 మధ్యకాలంలో గృహ నిర్మాణ పథకాల కోసం కేటాయించిన సుమారు రూ.3,300 కోట్లను ఇతర ప్రయోజనాలకు మళ్లించారు. జూన్ 2024 నుండి ఆ నిధులను గృహ నిర్మాణానికి వినియోగించి 3 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశాము. సుమారు 6 లక్షల లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఎస్సీ, బీసీ వర్గాలకు అదనంగా రూ.50,000, ఎస్టీలకు

రూ.75,000, పీ.వీ.టీ.జీ.లకు రూ.1,00,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాము. వచ్చే సంవత్సరంలో మరో 6 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి పీఎంఏవై-గ్రామీణ పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గృహ నిర్మాణ శాఖకు 6,357 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఎనర్జీ**

73. ఆధునిక అభివృద్ధికి ఎనర్జీ ప్రాణాధారం. ఎనర్జీ భద్రత అంటే ఆర్థిక భద్రత. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, విద్య, ఆరోగ్యం-ప్రతి రంగం విశ్వసనీయమైన, అందుబాటు ధరలో విద్యుత్‌పై ఆధారపడి ఉంది. గత పాలనలో పీ.పీ.ఏ.లను అస్తవ్యస్తంగా రద్దు చేయడం వల్ల అధిక ధరల విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చి, ట్రూ-అప్ చార్జీల రూపంలో ప్రజలపై భారంగా మారింది. మా ప్రభుత్వం సరైన విద్యుత్ కొనుగోలు విధానాలు, స్వీయ ఉత్పత్తి పెంపు ద్వారా ఈ రంగాన్ని స్థిరీకరించింది. ఫలితంగా టారిఫ్ సవరణలు చేసి లబ్ధిని వినియోగదారులకు అందించగలిగాము. ప్రస్తుత సంవత్సరంలో వ్యవసాయ విద్యుత్ సబ్సిడీగా రూ.11,000 కోట్లకు పైగా విడుదల చేసి 22.5 లక్షల రైతులకు లబ్ధి చేకూర్చాము. అలాగే ఆక్వా టారిఫ్ సబ్సిడీగా రూ.890 కోట్లు విడుదల చేసి 48,500 మంది ఆక్వా వినియోగదారులకు మద్దతు ఇచ్చాము. బీపీఎల్ వృత్తిదారులకు సబ్సిడీ టారిఫ్‌లు కొనసాగిస్తున్నాము.

74. సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం క్రింద జూన్ 2024 నుండి రూ.2.88 లక్షల కోట్ల విలువైన 55 ప్రాజెక్టులను మంజూరు చేశాము. ఇందులో 15.56 గిగావాట్ సౌరశక్తి, 4.86 గిగావాట్, వాయు శక్తి, 17.7 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, 1 ఎం.ఎం.ఎ.టి.పీ.ఏ. గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రాజెక్టులు ఉన్నాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఎనర్జీ శాఖకు 13,934 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**రవాణా, రహదారులు మరియు భవనాలు**

75. గత పాలనలో రహదారుల దుస్థితి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతలతో నిండిన రహదారులు ప్రమాదాలకు దారితీశాయి. మా ప్రభుత్వం అన్ని వర్గాల రహదారుల మెరుగుదలకు విస్తృతంగా చర్యలు చేపట్టింది. ఈ సంవత్సరం రూ.2,499 కోట్లతో 6,036 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి మంజూరు చేయబడింది.

76. పూర్వోదయ పథకం కింద ఈ-బస్సులను పొందేందుకు ప్రయత్నిస్తున్నాము. అదనంగా పీఎం ఈ-బస్ సేవా పథకం కింద 11 ప్రధాన నగరాల్లో 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతాము.

77. మహిళా సాధికారత మరియు భద్రత లక్ష్యంగా 15 ఆగస్టు 2025 నుండి “స్త్రీ శక్తి” పథకం ప్రారంభించాము. జనవరి 2026 నాటికి దాదాపు 40 కోట్ల మహిళా ప్రయాణికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

78. 2026-27లో ఎం.డి.ఆర్.లు మరియు రాష్ట్ర రహదారులపై లక్షిత పునరుద్ధరణల ద్వారా గుంతల రహిత రహదారులను నిర్ధారిస్తాము. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా ఆడిట్‌లు, సీసీ కెమెరాలు, iRASTE సాంకేతిక జోక్యాల ద్వారా రోడ్డు భద్రతను బలోపేతం చేస్తాము.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రవాణా, రహదారులు మరియు భవనాల శాఖకు 9,856 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**గనులు మరియు భూగర్భశాఖ**

79. గత పాలనలో గనుల రంగం వ్యక్తిగత లాభాల కోసం వినియోగించబడింది. మా ప్రభుత్వం పౌర కేంద్రిత ఖనిజ పరిపాలనకు ప్రాధాన్యం ఇస్తూ జూలై 2024లో ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. కేవలం ఆపరేషనల్ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తూ ఇసుక అందుబాటును నిర్ధారిస్తున్నాము. ఉచిత ఇసుక విధానం ఉన్నప్పటికీ డిజిటల్ పర్యవేక్షణ, అనుసరణ సంస్కరణల ద్వారా ఈ సంవత్సరం గనుల ఆదాయం 33% వృద్ధి సాధించింది.

**యువజనాభివృద్ధి, క్రీడలు, పర్యాటకం మరియు సంస్కృతి**

80. ఏపీ పర్యాటక విధానం 2024-29 ద్వారా పరిశ్రమ హోదా, మూలధన సబ్సిడీలు, ఎస్.జీ.ఎస్.టి. రీయింబర్స్‌మెంట్‌లు, స్టాంప్ డ్యూటీ మినహాయింపులు, పారదర్శక భూ కేటాయింపులతో ప్రగతిశీల విధానాన్ని

అమలు చేస్తున్నాము. ఏపీ పర్యాటక భూ కేటాయింపు విధానం-2025 ద్వారా గణనీయంగా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని క్యారవాన్ టూరిజం మరియు హోమ్ స్టే రంగాలలో ఆకర్షించడమైనది.

81. 117 ఎం.ఓ.యూ.ల ద్వారా రూ.20,088 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 1,22,637 ఉద్యోగావకాశాలు సృష్టించాము. రూ.6,681 కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత గరిష్ఠంగా రూ.428 కోట్ల కేంద్ర పర్యాటక గ్రాంట్ లభించింది. సూర్యలంక, అఖండ గోదావరి, గండికోట, సింహాచలం, బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జున సాగర్ వంటి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్రం 7 ప్రాధాన్య కేంద్రాలు మరియు 25కి పైగా థీమాటిక్ సర్క్యూట్‌లతో కూడిన బహుముఖ పర్యాటక గ్రిడ్‌ను అభివృద్ధి చేసింది. సంవత్సరానికి 60కు పైగా ఉత్సవాల నిర్వహణ ద్వారా సాంస్కృతిక పర్యాటకాన్ని ఉత్తేజపరచి, ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న అనుభవాల రాజధానిగా స్థాపిస్తోంది.

82. తిరుపతిని ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తామని మీకు తెలియచేయుటకు నేను సంతోషిస్తున్నాను.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ స్థాయి పర్యాటక వసతులతోపాటు హోటళ్ళతోపాటు వినోద ప్రదేశాలు ఏర్పాటు చేయబడును.

83. గోదావరి పుష్కరాల సందర్భంగా యాత్రికులకు భద్రతతో కూడిన ఆధ్యాత్మిక అనుభవం కల్పించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నాము. దీనికి ప్రారంభంగా రూ.60 కోట్లను కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాను.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను యువజనాభివృద్ధి, పర్యాటకం మరియు సంస్కృతి శాఖకు 439 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను

**ఖాతాలు 2024-25**

84. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక లెక్కలను కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పరిధిలోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయం వారు ఖరారు చేసిన ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ లోటు రూ. 60,285 కోట్లు, ఆర్థిక లోటు రూ.81,362 గా నమోదయ్యాయి. ఇవి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP)లో వరుసగా 3.79 శాతం మరియు 5.11 శాతంగా ఉన్నాయి.

**సవరించిన అంచనాలు 2025-26**

85. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం, రెవిన్యూ వ్యయం 2,38,021 కోట్ల రూపాయలు కాగా, మూలధన వ్యయం 39,498 కోట్ల రూపాయలు. రెవిన్యూ లోటు సుమారు 41,118 కోట్ల రూపాయలు కాగా, ఇదే కాలానికి ద్రవ్య లోటు సుమారు 80,567 కోట్ల

రూపాయలుగా ఉంది. ఇవి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో వరుసగా 2.33 శాతం మరియు 4.57 శాతంగా ఉన్నాయి.

**బడ్జెట్ అంచనాలు 2026-27**

86. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ. 3,32,205 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. అందులో ఆదాయ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లు గా అంచనా వేయబడింది. ఆదాయ లోటు సుమారు రూ. 22,002 కోట్లు కాగా, ఆర్థిక లోటు సుమారు రూ. 75,868 కోట్లు గా ఉండవచ్చని అంచనా. ఇవి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో వరుసగా 1.11 శాతం మరియు 3.84 శాతంగా ఉండనున్నాయి.

**ముగింపు**

*"ఈ రోజు మనం ఎంచుకున్న మార్గాలే...*

*రేపటి మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి"*

87. ఈ స్ఫూర్తికి ఈ బడ్జెట్ అద్దం పడుతుంది. ఇది కేవలం మన రాష్ట్రాన్ని రేపటి కోసం సిద్ధం చేసేందుకు ఉద్దేశించింది మాత్రమే కాదు. భవిష్యత్ తరానికి మేలు బాటలు పరిచే బడ్జెట్. ఇది ఆకాంక్షల్ని, బాధ్యతల్ని సమతుల్యం చేస్తుంది. ఈ బడ్జెట్ కేవలం వృద్ధి లెక్కలు చెప్పేది మాత్రమే కాదు. ఇది రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక గమనాన్ని, లక్ష్యాన్ని బలంగా చాటిచెబుతుంది. ఇది

కేవలం తాత్కాలిక ఉపశమనం కలిగించేది కాదు. దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ఉద్దేశించిన దార్శనిక పత్రం. ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తు సవాళ్లకు దీటుగా, బలమైన, స్వావలంబన కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన బడ్జెట్ ఇది.

88. రాష్ట్రం ఇకపై సాగించబోయే ప్రయాణానికి క్రమశిక్షణ, సాహసోపేత నిర్ణయాలు, సమష్టి కృషి అవసరం. లక్ష్య సాధనలో కచ్చితంగా విజయం సాధిస్తామన్న భరోసాతో ఉన్నాం. ఎందుకంటే... మనకు కలల్ని సాకారం చేయడంలో తిరుగులేని నాయకుడు, దార్శనికుడు శ్రీ చంద్రబాబు నాయుడి గారి నాయకత్వం ఉంది. భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు, తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీగారి అండదండలు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్‌గారి విశ్వసనీయ భాగస్వామ్య సహకారం... మరింత ఉత్సాహంతో లక్ష్యాన్ని చేరేలా ప్రేరణనిస్తాయి. ఆ నాయకులిచ్చే స్ఫూర్తి మనల్ని మెరుగైన భవిష్యత్ వైపు నడిపిస్తుంది.

89. ప్రజలు వేసే ప్రతి ఓటులో వారి ఆశలు, ఆకాంక్షలు నిక్షిప్తమై ఉంటాయి. ప్రతి ఓటు వెనుక ఉన్న ప్రజల ఆకాంక్షల్ని మనం నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. వాటిని సాకారం చేసేందుకు ప్రతి రోజు, ప్రతి క్షణం మనం కృషి చేయాలి. పరిపాలన అంటే అధికారం చెలాయించడం కాదు. ప్రజలకు సేవ చేయడం. ఈ బడ్జెట్‌ను మనం దీని పరిమాణాన్నిబట్టి కాకుండా, ఎంత నిబద్ధతతో

దీన్ని అమలు చేశామన్న దాన్ని బట్టి చూడాలి. దీనిలో చేసిన ప్రకటనల్ని బట్టి కాకుండా... అవి ప్రజల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపాయన్న దాన్ని బట్టి గుర్తు పెట్టుకోవాలి. ప్రజలు మాపై ఉంచిన అచంచల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారికి సేవ చేసే భాగ్యాన్ని మాకు కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ బడ్జెట్‌ను గౌరవ సభ ఆమోదం కోసం సమర్పిస్తున్నాను.

జై ఆంధ్రప్రదేశ్

జై హింద్